## క్లుప్తంగా

### కోదండరామస్వామికి వెండి కిరీటం బహూకరణ



దాతలను సన్మానిస్తున్న దేవాలయ కమిటీ చైర్మన్ పెండెం శ్రీనివాస్ గౌడ్

గరిడేపల్లి : మండల కేంద్రంలోని శ్రీకోదండ రామస్వామి దేవాలయంలో రామచంద్రస్వామివారికి తాటి వెంకట్‌రెడ్డి- రామ నర్సమ్మ కుమారుడు తాటి వెంకట్‌రెడ్డి-వీణమాధురీ దంపతులు రూ.80వేల విలువగల వెండి కిరీటంతో పాటు కలశం, పాదుకలను ఆలయ కమిటీ చైర్మన్ పెండెం శ్రీనివాస్ గౌడ్‌కు ఆదివారం అందజేశారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. దాతలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారులు సుదర్శనం శ్రీనివాసాచార్యులు, రామాంజాచార్యులు, గోదాదేవి కమిటీ సభ్యులు, భక్తులు తరలివచ్చారు.

### అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న దాతలు

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్‌రోడ్‌లోగల అయ్యప్ప సన్నిధానంలో ఆదివారం దాతలు బోడ నాగేశ్వరావు కృష్ణకుమారి, బాలేబోయిన వీరయ్య వీరకుమారి దంపతులతో పాటు వినాయకతేజ, శ్రీకావ్య, వెంకటేశ్వర్లు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, బర్మవత్ సీతారాంసింగ్, సూర్యారెడ్డి, నాగరాజు ఉన్నారు.

### ఆలయ అభివృద్ధికి దాతల విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయ అభివృద్ధికి పలువురు దాతలు విరాళాలు ప్రకటించారు. నడిగూడేనికి చెందిన చెన్నూరు వెంకటేశ్వర్లు, లక్ష్మి కుటుంబ సభ్యులు రూ.2లక్షలు, కొండా వెంకటసత్యనారాయణ గుప్త, పద్మావతి దంపతులు, పరమేశ్వర్‌ర్ శ్రీలక్ష్మి దంపతులు రూ.లక్ష, హైదరాబాద్‌కు చెందిన నూనె వెంకటేశ్వర్లు రూ.50 వేలు, కొండా దుర్గారావు రూ.15 వేలు, యర్ర సైదయ్య గుప్త రూ.10 వేలు విరాళాలు ప్రకటించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ భౌరిశెట్టి వెంకటరత్నం ఆదివారం తెలిపారు.

### భోజనశాల నిర్మాణానికి రూ.లక్ష విరాళం



సైదయ్య, అరుణకుమారి దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో భోజనశాల నిర్మాణానికి సికింద్రాబాద్‌కు చెందిన యర్రా సైదయ్య గుప్త, అరుణకుమారి దంపతులు ఆదివారం రూ.లక్ష విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మండవ వెంకటేశ్వరరావు, అనంతుల కృష్ణయ్య, బుస్సా మహేష్, మోహన్‌రావు, విజయ, ఆలయ పూజారి రాజశేఖర శర్మ, వెంపటి రామారావు, కాపర్తి వెంకటేశ్వర్లు, దయార్, సూర్యప్రకాష్‌రావు, దివ్వెల శ్రీనివాసరావు, ఎంపీ రమణరావు పాల్గొన్నారు.

### టీఆర్‌వీకేఎస్ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మోతె : జిల్లా కేంద్రంలో ఈ నెల 8న నిర్వహించనున్న టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర స్థాయి డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రతి సభ్యుడు హాజరు కావాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పోతరాజు రమేష్‌బాబు కోరారు. ఈమేరకు ఆదివారం మోతె మండల పరిధిలోని మామిళ్లగూడెం సబ్‌స్టేషన్‌లో కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మోతె మండల సెక్షన్ లీడర్‌గా ఎస్‌కె సైదా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీఆర్‌వీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, హుజూర్‌నగర్ డివిజన్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి, కోదాడ సబ్‌డివిజన్ లీడర్ సతీష్‌రెడ్డి, ట్రెజరర్ శేఖర్‌రెడ్డి, కాసాని శ్రీనివాస్, లైన్ ఇన్స్‌పెక్టర్ ప్రభాకర్, లైన్‌మెన్ రాఘవాచారి, సుధాకర్, శ్రీను, శ్రీశైలం, పఠాన్, గురువయ్య పాల్గొన్నారు.

# దిక్కుతోచని స్థితిలో కార్మికులు

- కోదాడ మున్సిపాలిటీలోని ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికుల కాంట్రాక్టు రద్దు
- ఉత్తర్వులు జారీ చేసిన మున్సిపల్ కమిషనర్
- 70 మంది కార్మికులను పనులకు పంపొద్దని ఆదేశాలు



కోదాడ : కోదాడ మున్సిపాలిటీలో 70 మంది పారిశుద్ధ్య కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గడిచిన ఐదు నెలలుగా వేతనాలు లేకుండా పనిచేస్తున్న వీరికి ఏదో ఒక రోజు వేతనాలు రాకపోతాయా.. ఉద్యోగం నిలవకపోతుందా అని చిన్న ఆశ వీరిలో ఉండేది. అయితే ఐదు నెలల క్రితం నియమించిన 70 మంది ఔట్ సోర్సింగ్ కార్మికుల కాంట్రాక్ట్‌ను రద్దు చేస్తున్నట్లు కోదాడ మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరెడ్డి సదరు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీకి ఉత్తర్వులు జారీ చేశారు.

**గత నెల 30న ఉత్తర్వులు జారీ..**

ఔట్ సోర్సింగ్ కింద నియామకమైన పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను గత నెల 30వ తేదీన జరిగే మున్సిపాలిటీ సమావేశంలో తీర్మానం చేసి వేతనాలు ఒకేసారి చెల్లిస్తామని చెప్పిన మున్సిపల్ కమిషనర్, అదే రోజు 70 మంది కార్మికులను తొలగిస్తున్నట్లు ప్రొసీడింగ్ నంబర్ ఎంసీకే/ఈ2/321/2022 వర్క్ ఆర్డర్‌ను రద్దు చేస్తున్నట్లు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకుడు షేక్ నషీమ్‌కు ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. డిసెంబర్ 30 నుంచి 70 మంది కార్మికులను పనికి పంపొద్దని కమిషనర్ ఏజెన్సీ నిర్వాహకులను ఉత్తర్వుల్లో కోరారు.

**ఎజెండాలో చేర్చని వేతన విషయం..**

ఇప్పటికే ఐదు నెలలుగా వేతనాలు లేకుండా పనిచేస్తున్న కార్మికులను ఇక నుంచి పనికి కూడా రావద్దని ఉత్తర్వులు ఇవ్వడంతో వారికి దిక్కు తోచడం లేదు. అధికార పార్టీలో నెలకొన్న విభేదాలే ఈ పరిస్థితికి కారణమయ్యాయని విపక్షాలు అంటున్నాయి. డిసెంబర్ 30న జరిగిన సమావేశంలో కార్మికుల వేతనాల విషయాన్ని ఎజెండాలోనే చేర్చలేదు. దీనిపై చర్చ జరపాలని అధికారపక్ష సభ్యులు కోరడం, దానికి చైర్‌పర్సన్ ఒప్పుకోకపోవడం, సమావేశం వాయిదా పడడం, దీనిపై పలువురు కౌన్సిలర్లు కలెక్టర్‌ను కోరడం, జనవరి 6న సమావేశం జరిపేలా చూస్తానని కలెక్టర్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే 6న నిర్వహించే సమావేశంలో తమ సమస్యకు పరిష్కారం దొరుకుతుందో లేదోనని కార్మికులు ఎదురు చూస్తున్నారు.

**వేతనాలు చెల్లించడానికి ఎలాంటి అభ్యంతరం లేదు**



పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలను చెల్లించడానికి మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ నిబంధనల ప్రకారం నియమించబడని టెండర్‌ను రద్దు చేయమని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. దీనిపై చర్చించడం ప్రభుత్వ దిక్కారం అవుతుందని చెప్పినా కమిషనర్, కొంత మంది కౌన్సిలర్లు వినడం లేదు. త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి ఈ సమస్యను పరిష్కరిస్తాం.

– వనపర్తి శిరీష, మున్సిపల్ చైర్‌పర్సన్

# కనులపండువగా కల్పవృక్ష వాహన పూజ



కల్పవృక్ష వాహన పూజలో అర్చకులు, భక్తులు

హుజూర్‌నగర్ : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా హుజూర్‌నగర్‌లోని శ్రీ వేణుగోపాల సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం కల్పవృక్ష వాహన పూజను కన్నుల పండువగా నిర్వహించారు. మహిళా భక్త బృందంచే తయారు చేయించిన కల్పవృక్ష వాహనానికి అర్చకులు వేద మంత్రోచ్ఛారణతో సంప్రోక్షణ గావించారు. తొలుత ఆలయంలో విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, వాస్తు హోమం తదితర పూజలు నిర్వహించారు. ప్రాతఃకాలంలో శ్రీ విష్ణుసహస్రం, గోదా, రామానుజ అష్టోత్తరాలు, తిరుప్పావై పఠించారు. సాయంత్రం రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారిని కల్పవృక్ష వాహనంపై అధిష్టింపజేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణం గావించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి, స్థానాచార్యులు, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### వేమూరికి సన్మానం



వేమూరిని సన్మానిస్తున్న రహీం తదితరులు

కోదాడఅర్బన్ : డాక్టరేట్ పొందిన సామాజిక ఉద్యమకారుడు వేమూరి సత్యనారాయణను ఆదివారం కోదాడలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ షేక్ రహీం ఘనంగా సత్కరించారు. మునగాల మండల పరిధిలోని నర్సింహాపురానికి చెందిన వేమూరి సత్యనారాయణకు గౌరవ డాక్టరేట్ రావడం అభినందనీయమని రహీం పేర్కొన్నారు. కార్యక్రమంలో గోలి జగదీశ్, నలమాద హరీశ్, నరేష్ ఉన్నారు.

# ప్రజా సంక్షేమానికి నిరంతర కృషి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



బీఆర్ఎస్‌లో చేరుతున్న వారికి పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ : రాష్ట్ర ప్రజల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంతర కృషి చేస్తోందని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మునగాల మండలం విజయరాఘవాపురానికి చెందిన పలువురు ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై వివిధ పార్టీల వారు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సుంకర అజయ్‌కుమార్, సోమపంగు లక్ష్మయ్య, కొత్తపల్లి మల్సూర్, ఎల్లమ్మ, వెంకటేశ్వర్లు, నరేష్, కుసుమకుమారి, హరికృష్ణ, సాయికుమార్ పాల్గొన్నారు.

**అయ్యప్ప ఆలయంలో పూజలు**

కోదాడఅర్బన్ : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆదివారం ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఎంపీపీ కవితారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పయిడిమర్రి సత్యబాబు, నాగేశ్వరరావు, మధు, పద్మజ, కోట మధు, శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు చల్లా రామ్మూర్తి, చంటి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

హుజూర్‌నగర్ : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆదివారం హుజూర్‌నగర్‌లోని విఘ్నేశ్వర, ఆంజనేయ స్వామి ఆలయాల్లో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కొండానాయక్, నాయకులు ఉన్నారు.



హుజూర్‌నగర్ : విఘ్నేశ్వరాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి



మేళ్లచెరువు : కేక్ కట్ చేస్తున్న చిన్నారులు

**ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన డీఎస్పీ**

ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డికి డీఎస్పీ వెంకటేశ్వర రెడ్డి శనివారం రాత్రి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సీఐలు రామలింగారెడ్డి, నాగదుర్గా ప్రసాద్, ఎస్ఐలు ఉన్నారు.

కోదాడరూరల్ : కోదాడలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ చింతా కవిత ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీవిజయ, మండల నాయకులు ఉన్నారు.

చిలుకూరు : చిలుకూరు ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అలసకాని జనార్దన్ తమ పాలకవర్గ సభ్యులు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు కొండా సోమయ్య, కస్తూరి సైదులు, బెల్లంకొండ సైదులు, కొడారు రాంబాబు, సీఈఓ చిలువేరు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండలంలోని వెలిదండ గ్రామంలో గల పెనుయేలు వర్షిప్ సెంటర్‌లో ఆదివారం పెనుయేలు సంఘాల అధ్యక్షుడు, సంఘ కాపరి పాస్టర్ జెజె సామ్యూల్‌సన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు, సుధాకర్, ఫిలిప్ హోసోకు, నాగరాజు, స్టీఫెన్ పాల్, యశ్రోస్, శ్రీలత తదితరులున్నారు.



కోదాడ ఎంపీడీఓ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ కవిత తదితరులు



చిలుకూరు ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో...



గరిడేపల్లి : ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



గరిడేపల్లి : కేక్ కట్ చేస్తున్న సామ్యూల్‌సన్ తదితరులు

# కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి కోరారు. ఈమేరకు మంత్రి పర్యటన ఏర్పాట్లపై ఆదివారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జనవరి 6న నిర్వహించే మంత్రి పర్యటనలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం సభాస్థలిని పరిశీలించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు చిట్యాల అమర్‌నాథ్‌రెడ్డి, బెల్లంకొండ అమర్, గెల్లి రవి, దొంతగాని శ్రీనివాస్ గౌడ్, కేఎల్ఎన్ రెడ్డి, అట్లూరి హరిబాబు, నర్సింగ్ వెంకటేశ్వర్లు, జక్కుల శంభయ్య, యడ్ల విజయ్, కడియాల రామకష్ణ, పి సంపత్, నవీన్‌రెడ్డి, నరేష్ తదితరులు ఉన్నారు.

**అధిక సంఖ్యలో తరలిరావాలి**

మంత్రి కేటీఆర్ సభకు నియోజకవర్గంలోని గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ గిరిజన సంఘ ముఖ్య నాయకులు కోరారు. వారిలో జగన్ నాయక్, కొండా నాయక్, నగేష్ రాథోడ్, బి వెంకటేశ్వర్లు నాయక్, అశోక్, మణికంఠ, నాగు, జిలేంద్రుడు, రామారావు, బాబు, సైదా, సందీప్ తదితరులు ఉన్నారు.

# బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న వేముల శేఖర్‌రెడ్డి

పాలకవీడు : బూత్ స్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి కోరారు. ఆదివారం పాలకవీడులో కోమటికుంట, కల్మేట్‌తండా, గుండ్లపహాడ్, చెర్వుతండా గ్రామాల ముఖ్యనాయకుల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా దేశం సురక్షితంగా ఉందంటే ప్రధాని నరేంద్ర మోదీ పాలనే నిదర్శనమని పేర్కొన్నారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొణతం లచ్చిరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, బాబు, సాంబశివరావు, లచ్చిరాం, ప్రకాష్, నరసింహ, నాగరాజు, సైదానాయక్, రాంబాబు, బాలు, వెంకటేశ్వర్లు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

### వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా నగేష్



నేరేడుచర్ల : తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా నేరేడుచర్ల పట్టణానికి చెందిన కోదమగుండ్ల నగేష్ ఎన్నికయ్యారు. 30వ తేదీన ఖమ్మంలో నిర్వహించిన రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### వైకుంఠ ఏకాదశికి ఆలయాలు ముస్తాబు



శ్రీరంగాపురంలో ఉత్తర ముఖంగా ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి

కోదాడఅర్బన్ : వైకుంఠ ఏకాదశికి వైష్ణవ ఆలయాలు ముస్తాబయ్యాయి. సోమవారం ముక్కోటి ఏకాదశి కావడంతో ఆయా దేవాలయాల్లో ఉత్తర ద్వారం ద్వారా ఉత్సవ మూర్తులు భక్తులకు దర్శనమివ్వనున్నారు. కోదాడ పట్టణంలోని శ్రీరంగాపురంలో ఉత్తర ద్వార ముఖంగా ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. అదేవిధంగా శ్రీకోదండరామాలయంలో ఉన్న వేంకటేశ్వర, రామాలయాల్లో ముక్కోటికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

# కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు



హుజూర్‌నగర్‌లోని లక్ష్మీనరసింహ వేణుగోపాల స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి దేవాలయంలో 17వ రోజు ఆదివారం ధనుర్మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, అష్టోత్తరం, సేవాకాలం, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, అలంకరణ, అమ్మవారికి పల్లకి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి లక్ష్మ ణరావు, మాజీ ధర్మకర్తలు, అర్చకులు పాల్గొన్నారు.

**వేంకటేశ్వరాలయంలో పుష్పయాగం..**

హుజూర్‌నగర్ : స్థానిక శ్రీగోదాదేవి పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరాలయంలో స్వామి అమ్మవార్లకు ఆదివారం పుష్పయాగం నిర్వహించారు. పూజల్లో వడ్లనాపు అనురాధ, రాంబాబు దంపతులు, తదితర భక్తులు పాల్గొన్నారు.

**రంగన్న గుడిలో ధనుర్మాస పూజలు**

కోదాడఅర్బన్ : ధనుర్మాసాన్ని పురస్కరించుకుని కోదాడ పట్టణంలోని శ్రీ గుంటి రఘునాథస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ పూజారి రాఘవాచార్యులు ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆలయ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, ముధుసూదన్‌రావు, గంధం పాండు, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లోని వేంకటేశ్వరాలయంలో నిర్వహించిన పుష్పయాగంలో పాల్గొన్న భక్తులు

# పార్క్ పనులకు మోక్షమెప్పుడో..

- నేరేడుచర్లలో అర్బన్ పార్క్ పనులకు శంకుస్థాపన చేసి రెండేళ్లు
- నేటికీ ప్రారంభం కాని పనులు



నేరేడుచర్లలో పార్క్ కోసం కేటాయించిన స్థలం



అర్బన్ పార్క్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి (ఫైల్)

నేరేడుచర్ల : నేరేడుచర్ల మున్సిపాలిటీలో అర్బన్ పార్క్‌కు శంకుస్థాపన చేసి రెండేళ్లు పూర్తవుతున్నప్పటికీ నేటికీ పనులు ప్రారంభం కాలేదు. 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.64లక్షల వ్యయంతో మున్సిపాలిటీలోని జాన్‌పహాడ్ రోడ్డులో ఎకరం 7గుంటల ప్రభుత్వ స్థలంలో అన్ని హంగులతో పార్క్ నిర్మాణం చేపట్టేందుకు మంత్రి కేటీఆర్ 2020 జూన్ 29వ తేదీన శంకుస్థాపన చేశారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతుండగా పార్క్‌కు కేటాయించిన స్థలం ఆక్రమణకు గురైందని గుర్తించిన మున్సిపల్ అధికారులు పనులను నిలుపుదల చేయాలని సూచించారు. రెవెన్యూ అధికారులు పార్క్‌కు కేటాయించిన ఎకరం 7గుంటల స్థలాన్ని చదును చేసి హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని కోరగా తూతూ మంత్రంగానే సర్వే చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ సర్వేలో కేవలం 34 గుంటలు మాత్రమే తేలిందని పేర్కొన్నారు. కేటాయించిన స్థలం కంటే 14 గుంటలు స్థలం తక్కువగా ఉండంతో ఏమి చేయాలో అర్థం కాక మున్సిపల్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

**స్టోర్ రూమ్‌కు చేరిన శిలాఫలకం..**

పార్క్ నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం మున్సిపల్ కార్యాలయంలోని స్టోర్ రూమ్‌కు చేరడంతో పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. మున్సిపాలిటీలోని ప్రజలు సేద తీరేందుకు ఏర్పాటు చేస్తున్న పార్క్ స్థలాలు ఆక్రమణకు గురికావడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో ఆక్రమణకు గురైన స్థలాన్ని గుర్తించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. కాగా.. రెవెన్యూ శాఖ పార్క్‌కు కేటాయించిన ఎకరం 7గుంటల స్థలాన్ని హద్దురాళ్లతో అప్పగించాలని మున్సిపల్ కమిషనర్ నీలిగొండ వెంకటేశ్వర్లు తహసీల్దార్ సరితకు ఇటీవల ప్రతిపాదన లేఖ అందజేశారు. ఈమేరకు త్వరలోనే మున్సిపల్ పార్క్‌కు కేటాయించిన స్థలంపై సమగ్ర సర్వే చేస్తామని కమిషనర్ చెప్పినట్లు తెలిసింది. స్థల సమస్య పూర్తయితే పనులు చేపట్టనున్నట్లు సమాచారం.

**పార్క్ పూర్తి చేయాలి**



పట్టణ ప్రజల ఆహ్లాదం కోసం చేపట్టిన పార్క్ నిర్మాణ పనులను త్వరతిగతిన పూర్తి చేయాలి. నేరేడుచర్ల మున్సిపాలిటీ ఏర్పడిన నూతనంగా ఏర్పాటు చేస్తున్న పార్క్ పనులు పూర్తి అయితే వృద్ధులు, చిన్నారులు, వ్యాపారస్తులు, ఉద్యోగులు, ఉదయం, సాయంత్రం వేళల్లో సేదతీరేందుకు పార్క్‌కు వస్తారు.

– ప్రసాద్, నేరేడుచర్ల

**త్వరలోనే పనులు చేపడతాం**



నేరేడుచర్ల మున్సిపాలిటీలోని జాన్‌పహాడ్ రోడ్డులో రెవెన్యూ శాఖ కేటాయించిన ఎకరం 7గుంటల స్థలం కొంత వరకు ఆక్రమణకు గురైంది. ఈ స్థలాన్ని సర్వే చేయాలని రెవెన్యూ శాఖకు ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే సర్వే చేపట్టి ఆక్రమణకు గురైన స్థలాన్ని గుర్తించి పార్క్ నిర్మాణ పనులు చేపడతాం.

– వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్, నేరేడుచర్ల